నేడే 'అమూల్'కు శంకుస్థాపన

- చీలేపల్లి వద్ద 300 పడకల ఆస్పత్రికి భూమిపూజ
- సిఎం జగన్ పర్యటనకు సర్వం సిద్ధం
- ఏర్పాట్లను పర్యవేక్షించిన మంత్రులు

సిఎం పర్యటనపై చిత్తూరులో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సగిలి షన్మోహన్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చిత్తూరు జిల్లా పర్యటన సందర్భంగా జిల్లా యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తి చేసింది. సభావేదిక, హెలిప్యాడ్‌ల వద్ద పటిష్టంగా గ్యాలరీల నిర్వహణ, తాగునీటి సదుపాయం తదితర ఏర్పాట్లు చేశారు. విజయ డెయిరీని అమూల్ చేతుల్లో పెడుతూ శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో భారీఎత్తున బందోబస్తు నిర్వహిస్తున్నారు. బహిరంగసభ వేదిక వద్ద జరుగుతున్న ఏర్పాట్లను సోమవారం ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి, రాష్ట్ర అటవీ శాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్తూరు ఎంపి ఎన్.రెడ్డెప్ప, జడ్‌పి ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ముఖ్యమంత్రి పర్యటనల సమన్వయ కర్త టి.రఘురాం, ఎపి డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ ఎమ్‌డి బాబు అహ్మద్, కలెక్టర్ సగిలి షన్మోహన్, ఎస్‌పి వై.రిశాంత్‌రెడ్డి, చిత్తూరు ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులు, ఎపిఎస్‌ఆర్‌టిసి వైస్‌ఛైర్మన్ విజయానందరెడ్డి, జేసీ వి.శ్రీనివాసులు, డిఆర్‌ఒ ఎన్.రాజశేఖర్‌లతో కలిసి పరిశీలించారు. బహిరంగసభ వద్ద ఎల్‌ఇడి స్క్రీన్‌లు, బారికేడ్లు, పార్కింగ్, సీటింగ్, తాగునీటి వసతి, శానిటేషన్ తదితర సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు.

నేడు వామపక్షాల నిరసనకు పిలుపు

మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ప్రజా సమస్యలను సిఎం పట్టించుకుని, జిల్లాను అభివృద్ధి చేయాలని సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలుపుతామని సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు వాడా గంగరాజు, నాగరాజన్ వెల్లడించారు. సిపిఎం కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ చిత్తూరు నగరాభివృద్ధికి నిధులు కేటాయించాలని, తక్షణం మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని, జిల్లా కేంద్రంలో ఇఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని కోరారు. గార్మెంట్స్, క్వారీ, ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లలోపనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. చిత్తూరు కేంద్రానికి ఎన్టీఆర్ జలాశయం నుంచి నీటిని సరఫరా చేసి ఆదుకోవాలన్నారు. మూతబడిన పరిశ్రమలను పునఃప్రారంభిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్‌చేశారు. విజయ డెయిరీ ప్రాంగణంలో వీరరాఘవులునాయుడు విగ్రహాన్ని యథాస్థానంలో ఏర్పాటు చేయాలని కోరారు. విజయ డెయిరీలో మిషన్లు స్క్రాప్‌ను తప్పుడు పద్ధతుల్లో టెండర్లు వేసి 7కోట్ల విలువ చేసే ఇనుమును కేవలం కోటి 40 లక్షలకు గుత్తేదారులకు అప్పగించడం వెనుకున్న అవినీతి కుంభకోణంపై సిట్టింగ్ జడ్జి చే విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

పర్యటనను విజయవంతం చేయాలి : కలెక్టర్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చిత్తూరు పట్టణానికి విచ్చేస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం సమన్వయంతో పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ తెలిపారు. ఎస్‌పి రిశాంత్‌రెడ్డితో కలిసి అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. చిత్తూరు అమూల్ డెయిరీ, 300 పడకలతో చీలాపల్లి సిఎంసి ఆస్పత్రి నిర్మాణానికి భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమాలకు సిఎం విచ్చేస్తున్నారని తెలిపారు. ఎస్‌పి మాట్లాడుతూ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నామన్నారు.

అమూల్ డెయిరీ మహిళా రైతులకు వరం : డిప్యూటీ సిఎం

అమూల్ డెయిరీ ప్రారంభిస్తే మహిళా రైతులకు వరమని ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి అన్నారు.వ్యవసాయం ద్వారానే కాకుండా పాడి పరిశ్రమ ద్వారా ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఇప్పటికే అమూల్‌కు పాలు పోస్తున్న రైతులకు లీటర్‌పై రూ.15 అదనంగా ఇస్తున్నామన్నారు. ఇప్పటికే జగన్మోహన్‌రెడ్డి 98.5 శాతం హామీలను అమలు చేశారన్నారు. 300 పడకల ఆస్పత్రి నిర్మాణం పూర్తయితే చిత్తూరు ప్రజలు వేలూరుకు వెళ్లకుండా ఇక్కడే చూపించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఆరోగ్యశ్రీ అమలయ్యేలా సిఎంతో మాట్లాడనున్నట్లు తెలిపారు.

పోలీసుల నిర్బంధంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

అమ్మకానికి గాజులమండ్యం షుగర్ ఫ్యాక్టరీ

- ముక్కలు ముక్కలుగా... అమ్మకానికి...!
- 166 ఎకరాలను జెసిబిలతో చదును
- రూ.వెయ్యి కోట్ల ఆస్తులు సమర్పయామి
- ఓ మంత్రి, ముగ్గురు ఎమ్మెల్యేల ధారాదత్తం



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'మేం అధికారంలోకి వస్తే చిత్తూరు, గాజులమండ్యం సుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తాం.. రైతులకు భరోసా కల్పిస్తాం.. ఉద్యోగులకు భద్రత ఇస్తాం' అంటూ పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన మాటను జగన్మోహన్ రెడ్డి తప్పారు. అధికారంలోకి వచ్చిన తరువాత 'మాట తప్పారు.. మడమ తిప్పారు..' ఏకంగా ప్రభుత్వ ఆస్తులను అమ్మకానికి పెట్టారు. మొన్నటికిమొన్న చిత్తూరు 'విజయ' డెయిరీని 'అమూల్' కార్పొరేట్ కంపెనీకి ధారాదత్తం చేశారు. ఇప్పుడు గాజులమండ్యం శ్రీ వెంకటేశ్వర సుగర్ ఫ్యాక్టరీని ముక్కలు ముక్కలుగా చేసి 'నలుగురు ప్రజాప్రతినిధులు' పంచుకోనున్నారు. ఈ మేరకు ఫైల్ చకచకా నడుస్తోంది.. వెయ్యి కోట్ల రూపాయల విలువ చేసే 166 ఎకరాల భూమిని జెసిబిలతో చదును చేస్తున్నారు. ఇక సర్వే చేసి, ముక్కలు చేసి, పంచుకోవడమే తరువాయి.

1972లో తిరుపతి సమీపంలోని గాజులమండ్యం వద్ద 166 ఎకరాలను సేకరించి 1975లో అప్పటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి చేతుల మీదుగా శ్రీ వెంకటేశ్వర సుగర్ ఫ్యాక్టరీని ప్రారంభించారు. అప్పట్లో 13వేల మంది రైతులు ఈ ఫ్యాక్టరీకి షేర్‌హోల్డర్లుగా ఉండేవారు. ప్రస్తుతం ఏడువేల మంది మిగిలారు. నిత్యం 3-5వేల మంది రైతులు తాము పండించిన చెరకు పంటను క్రషింగ్ చేసేవారు. నవంబర్‌లో క్రషింగ్ ప్రారంభం అయితే మార్చి వరకు జరిగేది. రోజుకు 1500-2000 టన్నుల క్రషింగ్ నిరంతరాయంగా జరిగేది. కడప, నెల్లూరు, చిత్తూరు, తమిళనాడు రైతులు ఈ ఫ్యాక్టరీకి చెరకును తోలేవారు. ప్రస్తుతం ఈ ఫ్యాక్టరీ నుంచి షేర్ హోల్డర్లకు రూ. 50 కోట్లు బకాయి ఉంది. 600 మంది కార్మికులు పనిచేసే ఈ ఫ్యాక్టరీలో మూతబడే నాటికి 357 మంది మిగిలారు. వీరికి 20 కోట్ల పిఎఫ్, గ్రాడ్యూటీ చెల్లించాల్సి ఉంది. 2018లో ఈ ఫ్యాక్టరీ మూతబడింది.

ముక్కలు ముక్కలుగా అమ్మకానికి

ఐదేళ్ల కాలంలో యంత్రాలన్నీ తుప్పు పట్టాయి. తుప్పుపట్టిన యంత్రాలే రూ. రెండు కోట్ల విలువ చేస్తాయి. భవనం కోటిన్నర పలుకుతుంది. జగన్మోహన్‌రెడ్డి హామీ మేరకు ఈ ఏడాది తెరుస్తారు, ఈ ఏడాది తెరుస్తారు అని రైతులు ఎదురుచూస్తూనే కాలం గడిపారు. తీరా రాష్ట్ర ప్రభుత్వం ఫ్యాక్టరీతో పాటు స్థలాన్ని సైతం ముక్కలు ముక్కలు చేసి, ప్రజాప్రతినిధులకు కట్టబెట్టేందుకు ఫైల్‌ను సిద్ధం చేసింది. వీరికి 99 సంవత్సరాలు లీజుకివ్వనుంది. వందల ఏళ్లనాటి 880 చెట్లను జెసిబిలతో కూలదోసింది. ఉన్న పాలకమండలిని రద్దు చేసి లిక్విడేటర్‌గా రవిబాబును నియమించింది. 166 ఎకరాల స్థలాన్ని చదునుచేసి సర్వే చేసేందుకు టెండర్లను సైతం పిలిచారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ఈ స్థలాన్ని ఉపయోగిస్తామని అధికార పార్టీ నేతలు చెబుతూ 99 సంవత్సరాలు లీజుకివ్వనున్నట్లుగా సమాచారం. జిల్లాకు సంబంధించిన ఓ మంత్రికి, ముగ్గురు ఎమ్మెల్యేలకు ఈ భూములను ధారాదత్తం చేసేందుకు రంగం సిద్ధమయ్యిందని తెలుస్తోంది.

ఫ్యాక్టరీని పునఃప్రారంభించాలి

మాంగాటి గోపాల్‌రెడ్డి, రైతుసమాఖ్య



ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి. సహకార చక్కెర ఫ్యాక్టరీని తెరిపించాలి. రైతులకు, కార్మికులకు భరోసా కల్పించాలి. ప్రస్తుతం ఆస్తులను సైతం అమ్మకానికి పెట్టడం దారుణం.

చక్కెర ఫ్యాక్టరీని అమ్మాలని చూస్తే ఆమరణదీక్ష : బొజ్జల సుధీర్

రేణిగుంట : శ్రీవెంకటేశ్వర చక్కెర ఫ్యాక్టరీని అమ్మాలని చూస్తే ఆమరణ నిరాహారదీక్ష చేపడతామని బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి అన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే ఆర్నెళ్లలో ఫ్యాక్టరీని పునఃప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. రేణిగుంట కన్వెన్షన్ హాలులో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర సుగర్ ఫ్యాక్టరీని అమ్మడానికి వైసిపి నేతలు కుట్రలు చేస్తున్నారన్నారు. 1500 కోట్లు విలువ చేసే ఈ భూమిని వైసిపి నేతలు ఎగరేసుకోవాలని పన్నాగాలు చేస్తున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు నగరి ఎమ్మెల్యే ఆర్కే రోజా ఇక్కడ నిరాహార దీక్ష చేపట్టి రైతులకు తమ ప్రభుత్వం రాగానే న్యాయం చేస్తామని వారిని మోసం చేశారన్నారు. టిడిపి మండల అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, మాజీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, మునిస్వామి నాయుడు పాల్గొన్నారు.

చెరకు రైతుల బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి- కెవిబిపురం

రైతు ప్రభుత్వం అని చెప్పుకునే వైఎస్‌ఆర్సిపి ప్రభుత్వం రైతులకు ఏమీ చేయకపోయినా ఏదో చేస్తున్నామని ప్రకటన చేస్తూ, ఆర్భాటాలు చేస్తోందని, సిఎంకు చిత్తశుద్ధి ఉంటే చెరకు రైతుల బకాయిలను వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్ ఒక ప్రకటనలో విమర్శించారు. జిల్లాలో చెరకు రైతులకు ఇంత అన్యాయం జరుగుతున్నా ముగ్గురు మంత్రులు ఈ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ 13 మంది ఎమ్మెల్యేలు ఈ జిల్లా నుంచి అత్యధిక మెజారిటీతో గెలిచిన వారు ఉన్నా ఈ జిల్లా రైతాంగం గురించి పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. నేతం, మయూర సుగర్ ఫ్యాక్టరీల యాజమాన్యం నుంచి రైతులకు రావాల్సిన 60 కోట్ల బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చెరుకు రైతులకు గిట్టుబాటు ధరను కేంద్ర ప్రభుత్వం నామమాత్రంగా క్వింటాలకు పది రూపాయలు పెంచడం దారుణమన్నారు. చెరుకు పంటకు ఒక టన్నుకు ఐదువేల రూపాయలు వంతన మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు.



ముందస్తు అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

ప్రజాశక్తి -పలమనేరు

ముందస్తు అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని పలమనేరు సిపిఎం పట్టణ కార్యదర్శి గిరిధర గుప్తా సోమవారం ఓ ప్రకటనలో ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు పట్టణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వస్తున్న సందర్భంగా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజును పోలీసులు వలయంలో నిర్బంధించడం ఎంతవరకు సమంజసం అని నిలదీశారు. ముఖ్యమంత్రి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు చెప్పుతూ ప్రజలు ఆశీస్సులు పొందడానికి వస్తున్నారే కానీ ఇలాంటి నిర్బంధాలతో ప్రశ్నించే నాయకులను ఇబ్బందులకు గురి చేయడం ఏ రాజ్యాంగంలో ఉందని మండిపడ్డారు. 2024 ఎన్నికలలో ప్రజలే గట్టి బుద్ధి చెప్తారని అన్నారు.

సిఎం పర్యటన షెడ్యూల్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి మంగళవారం చిత్తూరు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ఉదయం రేణిగుంట విమానాశ్రయానికి 9.15 గంటలకు చేరుకుంటారు. అక్కడి నుండి 9.25 గంటలకు హెలికాప్టర్‌లో చిత్తూరు జిల్లాకు బయల్దేరి వెళ్లి అక్కడ వివిధ అభివద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం తిరిగి మధ్యాహ్నం 2.05 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకొని 2.15 గంటలకు గన్నవరం తిరుగు ప్రయాణం కానున్నారు.

అమూల్‌కు అప్పగించడంలో కుట్రను వెల్లడించాలి

మాజీ రాజ్యసభ సభ్యులు పెనుమల్లి మధు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మంగళవారం చిత్తూరు డెయిరీ స్థానంలో అమూల్ డెయిరీని స్థాపించేందుకు భూమి పూజ చేస్తున్నారని, దీని వెనుక ఉన్న కుట్రను సిఎం జగన్మోహన్‌రెడ్డి వెల్లడించాలని సిపిఎం మాజీ రాజ్యసభ సభ్యులు పెనుమల్లి మధు డిమాండ్ చేశారు. బిజెపి చేతిలో కీలుబొమ్మగా మారి సంస్కరణలను అమలు చేస్తున్నారని విమర్శించారు. తిరుపతి యశోదా నగర్ లోని సిపిఎం జిల్లా కార్యాలయంలో సోమవారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడారు. అమూల్ డెయిరీ రాష్ట్రంలో పాడి రైతులను కబ్జా చేయడమే కాకుండా వారి ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా విధానాలు ఉన్నాయని విమర్శించారు. అమూల్ డెయిరీని ప్రమోట్ చేస్తే వచ్చే ఆదాయం అహ్మదాబాద్‌కు పోతుంది మినహా రాష్ట్రానికి ఒరిగేదేమీ లేదన్నారు. రాష్ట్రానికి చిల్లి గవ్వ కూడా ఖర్చుపెట్టే పరిస్థితి లేదన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ రాజ్యసభ సభ్యులు పి.మధు

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేస్తున్న కాంట్రాక్టర్ నర్సులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో పనిచేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులకు, ఇతర కేటగిరీ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ఎన్‌హెచ్‌ఎం ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేసి పరిపాలన అధికారికి వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా నర్సుల సంఘం జిల్లా కార్యదర్శి లత మాట్లాడుతూ ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఉద్యోగులఅందరి కంటే తక్కువ వేతనాలు ఇవ్వడం దారుణమని వాపోయారు. జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా మాట్లాడుతూ కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. బంగారుపాళ్యం కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో పనిచేస్తున్న ముగ్గురు స్టాఫ్‌నర్సులకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వలేదని, తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని శశికళ అధికారులను ప్రశ్నించారు. పనిభారం ఎక్కువగా ఉన్నందున ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు చెప్పారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు చైతన్య మాట్లాడుతూ కలెక్టర్ జోక్యం చేసుకుని ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

తిరుచానూరు

పెద్దచెరువును కాపాడండి : సిపిఎం

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: తిరుచానూరు పెద్ద చెరువును కాపాడాలని, 99 సంవత్సరాల లీజును రద్దు చేయాలని, కోట్ల రూపాయల విలువ చేసే భూమిని కాపాడాలని సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం గ్రీవెన్స్‌లో వినతిపత్రం సమర్పించారు.నాయకులు ఎస్.జయచంద్ర, సుమన్, చిన్నా, చిరంజీవి మాట్లాడుతూ తిరుచానూరులో ఉన్న చెరువు 125ఎకరాల విస్తీర్ణం ఉండేదని, ఆక్రమణలకు గురై 16 ఎకరాలు మిగిలిందన్నారు. ఈ చెరువును పూడ్చివేయడం వల్ల దాదాపు రెండు పంచాయతీలు పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. పెద్ద వర్షాలు కురిస్తే నీళ్లు బయటకు పోయే పరిస్థితి లేక ముంపు ఏర్పడే అవకాశం ఉందన్నారు. సుప్రీం తీర్పు ప్రకారం కేవలం 33 ఏళ్లు మాత్రమే లీజుకు ఇవ్వాలని, లీజును రద్దు చేయని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పౌష్టికాహారం ఇంటికే..

ఈనెల నుంచి ఐసిడిఎస్ లబ్ధిదారులకు టేక్ హోమ్ రేషన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

రక్తహీనత, పౌష్టికాహార లోపం ఉన్న గర్భవతులు, బాలింతలతోపాటు అంగన్వాడీ కేంద్రంలోని పిల్లలందరికీ పౌష్టికాహారం అందేలా స్త్రీ శిశు సంక్షేమశాఖ నేతృత్వంలో నడుస్తున్న అంగన్వాడీ కేంద్రాల పరిధిలోని లబ్ధిదారులకు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోంది. వేడివేడిగా వండి వడ్డించే పద్ధతిని జగన్ ప్రభుత్వం ఏడాది క్రితం కొత్త మెనూతో శ్రీకారం చుట్టింది. కొత్త మెనూలో వేరుశనగ చిక్కీలు, ఎండు ఖర్జూరంను చేర్చారు. అంతేకాకుండా ఒకే రకమైన మెనూకు బదులుగా రోజువారీ మెనూలో మార్పులు చేసి అన్ని రకాల పోషకాలతో కూడిన ఆహారం రోజూ ఉడికించిన కోడిగుడ్డు ఇవ్వాల్సి ఉంది.

ఐసిడిఎస్ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారం బాగుంది అనుకుంటున్న తరుణంలో ఉన్నఫలంగా జులై నుంచి లబ్ధిదారుల ఇంటి వద్దకే పప్పు, బియ్యం, గుడ్లు, పాలు ఇచ్చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వం ఉన్నట్లుండి ఎందుకు ఈ నిర్ణయం తీసుకుందో లబ్దిదారులకు అంగన్వాడీలకు అర్థం కావడం లేదు. లబ్దిదారులకు అన్నం, పప్పు, ఉడికించిన కోడి గుడ్డు ఇవ్వడం కోసం వంట గ్యాస్, కూరగాయల ఖర్చు వెరసి నెలనెలా అంగన్వాడీల బ్యాంకు ఖాతాల్లో జమచేయాలి. ఈ బిల్లులు నెలనెలా వచ్చే పరిస్థితి లేదు. కొన్ని సందర్భాల్లో అప్పులు చేసి వంట గ్యాస్ కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఓ పక్కన జీతాలు పెంచాలని పోరాటం చేస్తున్న అంగన్వాడీలు నెలనెల కూరగాయలు, వంట గ్యాస్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాని్న డిమాండ్ చేస్తున్నాయి. ఖర్చులు తగ్గించుకొనే క్రమంలో ప్రభుత్వం టేక్ హోం రేషన్ పద్ధతి మార్చిందనే ఆరోపనలున్నాయి.

ఏడాదికే ఆదర్శ మెనూకు మంగళం..

ఏడాది క్రితం రాష్ట్ర ప్రభుత్వం ఆదర్శ మెనూ పేరుతో ఐసిడిఎస్‌లో కొత్త మెనూకు శ్రీకారం చుట్టింది. ఆర్భాటంగా ప్రారంభించిన ఆదర్శ మెనూకు ఏడాది కాలంలోనే మంగళం పాడేసింది. జులై నుంచి లబ్దిదారులకు ఇంటికే బియ్యం, పప్పు, గుడ్లు, వంటనూనె అందించనున్నారు. ఆదర్శ మెనూలో పేర్కొన్నట్లు మధ్యాహ్న భోజనం రుచిగా అందించాలి. కూరగాయలు, గ్యాస్ బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో కాస్త ఇబ్బందిగా ఉన్నా నెట్టుకొచ్చేవారు.

అంగన్వాడీ కేంద్రాల వద్దకు వచ్చిన బాలింతలు, గర్భవతులు భోజనం చేసేవారి సంఖ్య తక్కువగా ఉందనే సాకుతో ఆదర్శ మెనూ ఎత్తివేస్తున్న ప్రభుత్వం ప్రకటించింది. జులై నుంచి అంటే ఈ నెల నుంచి 3 - 6 ఏళ్ళ పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల్లోనే పాత పద్ధతిలోనే వంటచేసి పెడతారు. మూడుఏళ్ళలోపు పిల్లలకు బియ్యం, పప్పు, గుడ్లు, పాలు ఇండ్లకే ఇచ్చేస్తారు. గత ప్రభుత్వంలో అంగన్వాడీ సెంటర్లలో లబ్దిదార్లకు వంట చేసి పెట్టేవారు. గతేది వైఎస్ఆర్ సంపూర్ణ పోషణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఐసిడిఎస్ కేంద్రాల్లో అదర్శ మెనూకు శ్రీకారం చుట్టింది. ఈమేరకు మెనూ ప్రతిరోజు ఏఏ రకమైన కూరగాయలతో వంటలు వండాలో సర్క్యులర్ జారీ చేసి మెనూ ఛార్టు ప్రకటించింది. కూరగయాలు, వంట గ్యాస్ బిల్లులు నెలనెలా చెల్లించడంతో జాప్యం జరిగింది. దీంతో మెనూ ప్రకారం లబ్దిదార్లకు భోజనం అందించేందుకు అంగన్వాడీ కార్యకర్తలు నానా తంటాలు పడ్డారు.

లబ్ధిదారుల ఇలా ....

జిల్లాలోని 21 ప్రాజెక్టుల పరిధిలోని 66 మండలాల్లో గర్భతులు, బాలింతలు 60,243 మంది. ఒక చిత్తూరు జిల్లాలోని 31 మండలాల్లో 30,990మంది వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కింద బాలింతలు, గర్భవతులు ఉన్నారు. 7 నెలల నుండీ 3 సంవత్సరాల లోపు పిల్లులు 21 ప్రాజెక్టుల పరిధిలో 1,40,882 మంది ఉన్నారు. చిత్తూరు జిల్లాలో 62,922 మంది. 3 నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలు ప్రీస్కూల్ నిర్వహిస్తున్న పిల్లలు 84,535 మంది లబ్దిదారులు ఉన్నారు.

ప్రభుత్వ ఆదేశం మేరకే టేక్ హోం రేషన్

రాష్ట్ర ప్రభుత్వం జులై నెల నుంచి లబ్దిదారుల ఇంటికే ఐసిడిఎస్ ద్వారా అందించే పౌష్టికాహారం సరఫరా చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జులై నుండీ జిల్లాలోని సిడిపిఓలకు టేక్ హోమ్ రేషన్ అమలు చేయాలని సర్కులర్ జారీ చేయడం జరిగింది. ప్రభుత్వం నిర్ధేశించిన ప్రకారం రాగిపిండి, బియ్యం, కోడిగుడ్లు, వంటనూనె, పాలు అందించాల్సి ఉంటుంది.

- నాగశైలజ, స్త్రీ శిశు సంక్షేమశాఖ పిడి



విజయ డెయిరీ స్క్రాబ్ అవినీతిపై విచారణ జరిపించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లాకే తలమానికంగా ఉన్న దేశంలోనే అతిపెద్ద రెండవ సహకార సంఘమైన విజయ డెయిరీ గత ప్రభుత్వాల తప్పిదాల వలన మూసివేయడం జరిగిందని, ప్రస్తుత ప్రభుత్వం ప్రారంభిస్తామని చెప్పి గుజరాత్ అమూల్‌కి అప్పనంగా అప్పగిస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు సోమవారం ఓ ప్రకటనలో విమర్శించారు. ఆయన మాట్లాడుతూ విజయ డెయిరీని అమూల్‌కు అప్పగించే క్రమంలో డెయిరీలో ఉన్న ఇనుము, స్టీల్‌ను స్క్రాబ్ పేరుతో సుమారు రూ. 7కోట్లు విలువచేసే స్క్రాబ్‌ని కోటి 40లక్షలకు అధికారపార్టీ వ్యాపారికి అప్పగించిందని, ఇందులో కోట్ల రూపాయలు చేతులు మారినట్లు అర్థమవుతోందని, ఈ కుంభకోణం అవినీతిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ప్రజల ఆస్తిని అప్పనంగా ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తున్న ప్రభుత్వం స్క్రాబ్‌లో కూడా ఇంత అవినీతికి పాల్పడం దుర్మార్గమన్నారు. ఏడు కోట్ల రూపాయలకు అమ్మితే వచ్చే డబ్బులను రైతులకు కొంత వరకు వారి వాటాలను చెల్లించవచ్చు అని అలా కాకుండా టెండర్లు పిలువకుండా విస్తతమైన ప్రచారం చేయకుండా అంతరహస్యంగా వేలం వేశారంటే కోట్లరూపాయలు అవినీతి జరిగిందని స్పష్టమవుతోందన్నారు. ఇప్పటికైనా అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

సమిష్టి కృషితోనే మండలాభివృద్ధి

ప్రజాశక్తి-కార్వేటినగరం: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమిష్టిగా కృషి చేసినప్పుడే మండలం అభివృద్ధి బాటలో ఉంటుందని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. సోమవారం వెలుగు కార్యాలయంలో మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు తీసుకొచ్చిన సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించినప్పుడే మండలం జిల్లా స్థాయిలో ఆదర్శంగా నిలుస్తోందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అదే విధంగా ప్రజా ప్రతినిధులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన లబ్దిదారులకు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. అలాగే మండల సర్వసభ్య సమావేశానికి హాజరు కాని అధికారులకు మెమో ఇవ్వాలని ఉన్నత అధికారులను ఆదేశించారు. మూడు నెలలకోసారి నిర్వహించే సమావేశానికి కూడా హాజరుకాని అధికారులు విధులు కూడా ఇలాగే నిర్వహిస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం వ్యవసాయ అధికారిణి హేమలత మాట్లాడుతూ ప్రభుత్వం 650 మందికి రైతు భరోసా అందించిందన్నారు. అదే విధంగా వేరుశెనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులు రాయితీపై అందించే విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రాగి సాగు విస్తారాన్ని పెంచే విధంగా రైతు భరోసా సిబ్బంది, రైతులకు అవగాహన కల్పించాలని, రాగి పంటకు ప్రభుత్వం రూ.38 గిట్టుబాటు ధర కల్పిస్తోందన్నారు. అనంతరం హౌసింగ్ ఏఈ యోగేంద్ర నాయుడు మాట్లాడుతూ పక్కాగృహ నిర్మాణాలకు, ప్రజా ప్రతినిధులు సేకరించి లబ్దిదారులు నిర్మాణాలు చేపట్టే విధంగా చూడాలని, లేని పక్షంలో పట్టాను రద్దు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గిరీషా మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో తాగునీటి సౌకర్యంతో పాటు మురుగు నీటి కాలువలు నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. అదే విధంగా పలువురు అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను సమావేశంలో వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కార్తీక్ రెడ్డి, మణెమ్మ, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, మేజర్ పంచాయతీ ధనంజయవర్మ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యం

గ్రామాల్లో తాగునీటి సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. సోమవారం ముస్లీం కాలనీకి మేజర్ పంచాయతీ సర్పంచ్ ధనంజయ వర్మ ఆధ్వర్యంలో తాగునీటి సౌకర్యానికి ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రతి ఇంటికీ తాగునీటిని అందించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి హమీద్ ఖాన్, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, సోషల్ మీడియా మండల కన్వీనర్ రఫీ, వైసీపీ నాయకులు షబ్బీర్ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి-సోమల: కుష్టు వ్యాధి నివారణ, అవగాహన కార్యక్రమాలలో భాగంగా మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవన్‌లో మహిళా సంఘ సభ్యులకు ఏఎన్ఎం గీత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం మాట్లాడుతూ స్పర్శ లేని మచ్చలు ఉంటే గుర్తించి వెంటనే వైద్య సిబ్బందిని కలసి పరీక్షలు చేయించుకుని నివారణకు ప్రభుత్వం ఉచితంగా అందజేసే మందులు, మాత్రలను వాడి కుష్టు వ్యాధి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మహిళలకు తెలిపారు. జూన్ 26 నుంచి జులై 16వ తేదీ వరకు కుష్టు వ్యాధి అవగాహన, గహ సందర్శన ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది చేస్తున్నారని, వీరికి ప్రతి ఒక్కరూ సహకరించి ఏమైనా అనుమానాలు ఉంటే నివత్తి చేసుకోవడం లేదా వైద్యులను కలవడం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆశ విజయలక్ష్మి, సంఘమిత్ర కుమారి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రామకుప్పం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండి వ్యాధులను నివారించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజాలాపురం ఆరోగ్య ప్రాథమిక వైద్యాధికారి అల్తాఫ్ హుస్సేన్ పేర్కొన్నారు. సోమవారం కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పరిసరాల్లో పరిశుభ్రతతో పాటు ఇంటి నివాస పరిసరాల్లో కూడా శుభ్రత ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సాదియా, హెల్త్ అసిస్టెంట్ బాలు, ఆరోగ్య విద్యా అధికారి ప్రవీణ్, ఏఎన్ఎంలు రీట, కావ్య, విద్యార్థులు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత అవసరం

ప్రజాశక్తి-కార్వేటినగరం: వృద్ధులకు వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో అవసరమని పుత్తూరు కేకేసీ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ యూ.యూనీస్‌రాణి అన్నారు. సోమవారం కార్వేటినగరంలో రాస్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ యోగా, ధ్యానంతో కలిగే ఉపయోగాలను వద్ధులకు వివరించారు. వృద్ధాప్యంలో వ్యక్తిగత పరిశుభ్రత ఉంటే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఈ క్రమంలో భాగంగా వృద్ధులకు టవళ్లు, పండ్లు, స్వీట్లను పంచారు. అలాగే మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో రాస్ కోఆర్డినేటర్ ప్రకాష్, కేకేసీ నర్సింగ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరిద్దాం

ప్రజాశక్తి-గుడిపల్లి: ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. సోమవారం మండలంలో సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాఖల వారీగా ఈ మూడు నెలల కాలంలో చేసిన అభివృద్ధి పనులను ఆయన సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో అవకతవకలు జరుగుతున్నాయని తన దష్టికి వస్తుందని సరి చేసుకోవాలని ఆ శాఖకు సూచించారు. ఇకపై ఇలాంటి ఫిర్యాదులు అందకుండా చూసుకోవాలని, అలాగే గ్రామ పంచాయతీ సర్పంచులకు ప్రతి శాఖ వారు సమాచారం అందించి కార్యక్రమాలు, అభివృద్ధి పనులు నిర్వహించాలని తెలిపారు. అదే విధంగా మా ప్రభుత్వంలో అభివద్ధి జరిగిందని టిడిపి, లేదు మా ప్రభుత్వంలో అని వైసిపి సర్పంచులు మాటల యుద్ధానికి దిగారు. దీంతో ఎమ్మెల్సీ కలుగజేసుకుని ఇరు వర్గాలను శాంతింపజేసి పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ప్రజల శ్రేయస్సుకు పని చేయాలని తెలిపారు. మండల సర్వసభ్య సమావేశంలో మాటలతో కాకుండా ప్రజలకు పనులు చేసే విధంగా అధికారులు సమన్వయం పరుచుకుని గ్రామాల అభివద్ధికి కషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి గోపి, జడ్పిటిసి కష్ణమూర్తి, సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐకమత్యంగా పనిచేద్దాం: మండలంలోని తెలుగుదేశం కార్యకర్తల సమావేశం సోమవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కంచర్ల శ్రీకాంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ ఐకమత్యంగా పని చేద్దాం విజయం మనదే అన్నారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని చిన్నచిన్న సమస్యలు మీ మధ్య ఉన్నా వాటిని పట్టించుకోకుండా చంద్రబాబుకు అధిక మెజార్టీ వచ్చే విధంగా మండలంలో ప్రతి కార్యకర్త, నాయకులు అంకితభావంతో పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మునిరత్నం, పార్టీ అధ్యక్షులు బాబు, కుప్పం నియోజకవర్గ సమన్వయ కన్వీనర్ ఆర్ చంద్రశేఖర్, మాజీ జడ్పిటిసి బెటప్ప నాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు హేమాంబర్ గౌడు పాల్గొన్నారు.

బీద రవిచంద్రకు పరామర్శ

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రను టిడిపి నేతలు నెల్లూరులో ఆయన స్వగృహంలో పరామర్శించారు. గత కొద్దిరోజుల క్రితం కాలికి గాయం కావడంతో జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్, యాదమరి మండల పార్టీ అధ్యక్షులు మోరాజీ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బీద రవిచంద్ర మాట్లాడుతూ మరో నెల రోజుల్లోపు తిరిగి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారన్నారు. చిత్తూరు జిల్లాలో పార్టీ బలోపేతానికి అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించడంతోపాటు గంగాధర నెల్లూరు, పూతలపట్టు కొత్త ఇన్‌ఛార్జిలతో కలిసి విస్తతంగా పర్యటించి పార్టీ పటిష్టతకు కషి చేయాలని కోరినట్లు వీరు తెలిపారు.

నేటి నుంచి యుజి, పిజి సెమిస్టర్ పరీక్షలు

ప్రజాశక్తి-కుప్పం: ద్రావిడ విశ్వవిద్యాలయంలో యుజి, పిజి (మొదటి, మూడవ సెమిస్టర్) పరీక్షలను నేటి నుంచి ఈనెల 14వ తేదీ వరకు ముందస్తు షెడ్యూల్ ప్రకారం నిర్వహించడం జరుగుతుందని వర్సిటీ రిజిస్ట్రార్ ఎ.కె.వేణుగోపాల్ రెడ్డి సోమవారం తెలిపారు. కావున సంబంధిత సెమిస్టర్ విద్యార్థులు వర్సిటీ ప్రాంగణంలో జరిగే పరీక్షలకు హాజరు కావాలని కోరారు. పరీక్షలు ముగిసిన వెంటనే త్వరితగతిన ఫలితాలను వెల్లడించేందుకు కృషి చేస్తామన్నారు.

ప్రజలకు రక్ష 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి-నగరి: జగనన్న సురక్ష కార్యక్రమం పల్లె, పట్టణాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని మంత్రి ఆర్కే రోజా సోదరులు రామ్‌ప్రసాద్ రెడ్డి అన్నారు. సోమవారం 3,4,5 వార్డులకు సంబంధించి ఓంశక్తి ఆలయం వద్ద గల సచివాలయ పరిధిలో ఏర్పాటుచేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘంతో కలిసి అర్హులైన లబ్దిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డుల్లో మార్పులు వంటివి చాలా సులభతరం చేస్తూ ప్రభుత్వ వ్యవస్థను ప్రజల చెంతకు చేరవేసిందన్నారు. అర్హులైన ఏ ఒక్కరూ లబ్ధి పొందకుండా మిగిలిపోకూడదన్న లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టారన్నారు. ప్రజలకు జవాబుదారీతనం ఉండాలన్న లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సత్వరమే 11 సేవలు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో నెల రోజుల పాటు కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. సర్వీస్ చార్జీ లేకుండా ఉచితంగానే ధ్రువపత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. 3,4,5 వార్డులకు సంబంధించి కులధ్రువీకరణ పత్రాలు 177 మందికి, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు 184 మందికి, ఆధార్ మొబైల్ లింకింగ్ 22 మందికి, రేషన్ కార్డుల్లో మార్పులు 15 మందికి, వివాహ రిజిస్ట్రేషన్ ఒకరికి ఎలాంటి రుసుము లేకుండా అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ బాలన్, మున్సిపల్ సచివాలయ కార్యదర్శి దయానిధి, కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, మునికష్ణారెడ్డి, బీడీ భాస్కర్, ఇంద్రయ్య, మోహన్‌రాజ్, భూపాలన్, డీఈ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: జగనన్న సురక్షతో ప్రజలకు ఎంతో మేలు అని ఎంపీపీ అమరావతి అన్నారు. సోమవారం మండలంలోని బంగారుపాళ్యం-2 సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జడ్పిటిసి సోమశేఖర్, సర్పంచి ఉమాదేవి, ఎంపిటిసి ఉషారాణి, డిప్యూటీ తహశీల్దారు ఇబ్రహీం, ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

'అమూల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా జగన్'

ప్రజాశక్తి-పలమనేరు: చిత్తూరు డెయిరీని అమూల్ సంస్థకు అప్పనంగా ధారాదత్తం చేయడం దారుణమని, అమూల్ సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా సీఎం జగన్ రెడ్డి వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి అమర్‌నాథ రెడ్డి విమర్శించారు. సోమవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుజరాత్‌కు చెందిన పాల ఉత్పత్తుల సంస్థ అమూ ల్‌కు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఏపీలో బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారన్నారు. వేల కోట్ల ఆస్తులను స్థానికంగా ఉండి డెయిరీలకు కాదని ఉత్తరాది సంస్థకు కట్ట బడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన విజయ డెయిరీ పునరుద్ధరణ పేరుతో సుమారు రూ.650 కోట్ల ప్రజాధనాన్ని కారుచౌకగా కేవలం ఏడాదికి రూ.కోటి లీజుకు 99 ఏళ్ల అమూల్‌కు అప్పగించటం దారు ణమన్నారు. నిన్నమొన్నటి వరకు హెరిటేజ్, సంగం డెయిరీ లపై విషం చల్లిన వైసీపీ నాయకులు అమూల్ విషయంలో మాత్రం ఎక్కడ లేని ప్రేమను చూపిస్తున్నారన్నారు. ఇప్పటికే చిత్తూరులో శివశక్తి డెయిరీ పేరుతో స్థానిక మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాడి రైతులను దోపిడీ చేస్తుంటే, అమూల్ పేరుతో సీఎం జగన్ పెద్ద కుట్రకు తెరతీశారని ఎద్దేవ చేశారు. పొరుగు రాష్ట్రాలు అయిన తమిళనాడు, కర్ణాటకలు అమూల్ మోసాలను గ్రహించి దూరం పెడితే.. కమీషన్ల కోసం, తన మీద ఉన్న కేసుల మాఫీ కోసం ఆంధ్ర పాడిరైతు ల భవిష్యత్తును గుజరాత్ కార్పొరేట్ కాళ్లకింద పెట్టారన్నారు.

మిరపకాయపై అల్లూరి సీతారామరాజు చిత్రం



ప్రజాశక్తి-యాదమరి: నేడు అగ్గిపిడుగు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా యాదమరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆర్ట్ మాస్టర్ కె.దామోదరాచారి అల్లూరి సీతారామరాజు చిత్రాన్ని సోమవారం మిరపకాయపై చిత్రించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం సాయుధ పోరాటం సల్పిన చైతన్య కిషోరం అగ్గిపిడుగు అల్లూరి సీతారామరాజు మన్యం గిరిజనులను ఏకంచేసి గెరిల్లా పద్ధతుల్లో బ్రిటీష్ వారి గుండెల్లో నిదురపోయాడన్నారు. దేశం కోసం ప్రాణం త్యాగం చేసి, బ్రిటీష్ నిరంకుశ పోలీస్ స్టేషన్లపై 'మిరపకాయ టపా' పేరుతో ముందుగా తెలియజేసి ఆ తరవాత తన అనుచరులు అగ్గిదొర, గంటందొర, ఎండు పడాలు, గోకిరా, ఏర్రేసు మున్నగుతో దాడిచేసి ఆయుధాలు దోచుకునేవాడని, గొప్ప దేశభక్తు డని గాంధీచే కీర్తించబడి నేతాజీకీ స్ఫూర్తిగా నిలిచాడని తెలిపారు.

ఎకరాకు రూ.10 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి-పలమనేరు: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ తరహాలో ఏపీలో కూడా రైతులకు ఎకరాకు రూ. 10 వేలు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు ఉమాపతి నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రైతుసంఘం రాష్ట్ర పిలుపుమేరకు రైతుసంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సచివాలయాలలో పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రాల సమర్పణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ విధానాల కారణంగా మన రాష్ట్రంలో ప్రతి రైతు రూ. 2.45 లక్షల రుణభారంతో ఉన్నారని, దేశంలో ఆత్మహత్యలలో మన రాష్ట్రం 3వ స్థానంలో ఉన్నదని వీరిలో అత్యధికం పేద, కౌలు రైతులే అని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధరలు అశాస్త్రీయంగా ఉన్నాయన్నారు. రైతులకు పగటిపూట 9 గంటలు ఉచిత విద్యుత్తును కొనసాగించాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రైతాంగానికి అనుసంధానం చేయాలని, గ్రామీణ ప్రాంతాలలో రైతుల వ్యవసాయ భూములకు రహదారులను వెంటనే ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రం పెంగరగుంట సచివాలయంలోని పంచాయతీ కార్యదర్శి మణికి సమర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటీసీ సుబ్రమణ్యం, నాగరాజ, మునేంద్ర, పి సుబ్రమణ్యం, చంగప్ప పాల్గొన్నారు.

వివిధ శాఖల పనితీరుపై మండిపడ్డ ఎంపీపీ

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం ఎంపీడీవో బాలాజీ అధ్యక్షతన నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ శాఖల అధికారుల పనితీరు గురించి క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. వాటిలో భాగంగా వెటర్నరీ డాక్టర్ సభలో మాట్లాడటంతో అక్కడ ఉన్న సర్పంచులు, ఎంపీటీసీలు పంచాయతీ పరిధిలోని వెటర్నరీ సిబ్బందిపై అధిక ఫిర్యాదులు వచ్చాయని, అంతేకాకుండా తీర్థం బైరెడ్డిపల్లి వెటర్నరీ హాస్పిటల్‌లో ఆవులకు సంబంధించి ఏమి అడిగినా స్టాక్ లేవని, ప్రైవేట్‌లో కొనుగోలు చేసి ఆవులను పోషించే పరిస్థితిని వచ్చిందని సర్పంచులు ఫిర్యాదు చేశారు. పంచాయతీ పరిధిలోని వెటర్నరీ సిబ్బందికి సోకాస్ నోటీసు అందజేసి ఇలా ఎప్పుడూ జరగకుండా చూడాలని ఎంపీపీ మొగసాల రెడ్డప్ప ఎంపీడీవోని ఆదేశించారు. అగ్రికల్చర్ ఏవో గీత మాట్లాడుతూ ప్రతి 25 ఎకరాలకు ఒకచోట భూసార పరీక్ష చేసేందుకు మట్టి నమూనా సేకరిస్తున్నట్లు దీనివల్ల రైతులు భూముల్లో ఏ పంట వెయ్యాలో ఎంత మోతాదు ఎరువు వేయాలో క్షుణ్ణంగా తెలుపుతుందని తెలిపారు. అలాగే ప్రభుత్వం వారు అందించే ఇన్స్యూరెన్స్ రైతులకు అందాలంటే ఈ కేవైసీ కచ్చితంగా చేయించుకోవాలని అన్నారు.

పాముల హల్‌చల్

ప్రజాశక్తి-నగరి: మున్సిపల్ పరిధి ఏకాంబర కుప్పంలోని ప్రకాష్ నగర్‌లో గుబురుగా ఉన్న చెట్ల సమీపంలోని ఇంటి బాత్రూంలోకి మూడు పాములు చొరబడటంతో ఆ ఇంటికి చెందిన వారితో పాటు స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పాములను అక్కడి నుంచి పంపేందుకు వారు ప్రయత్నించగా చెట్లమధ్యలోకి వెళ్లి రెండు పాములు కలసి పెనవేసుకొని ఎగిసి పడటాన్ని ఆశ్చర్యంగా చూడసాగారు. ఇంటి యజమానులు మున్సిపల్ అధికారులకు సమాచారం అందించగా వారు పుత్తూరు నుంచి స్నేక్ క్యాచర్ శ్రీకాంత్‌ను రప్పించారు. అప్పటికే పాములు బాత్రూంలో నుంచి పక్కనే ఉన్న పొదల్లోకి ప్రవేశించడంతో వాటిని పట్టడానికి తీవ్ర చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. సమీప ప్రాంతాల్లో పాముల పొలుసులు ఎక్కువగా కనిపించడంతో ఆ పాములు అక్కడే సంచరిస్తూ ఉన్నాయని పొదలను శుభ్రపరిస్తేనే వాటిని పట్టగలమని స్నేక్ క్యాచర్ మున్సిపల్ అధికారులకు సూచించారు.

ఎంఈవోకు అభినందనలు

ప్రజాశక్తి-యాదమరి: యాదమరి విద్యాశాఖ అధికారి-1 గా బాధ్యతలు స్వీకరించిన రుక్మిణమ్మను సోమవారం పిఆర్‌టియు మహిళా అధ్యక్షులు హిమబిందు, మండల అధ్యక్ష ప్రధానకార్యదర్శులు శివప్రసాద్, సురేష్, రెడ్డి, గౌరవ అధ్యక్షులు ఆనందపిళ్ళై, నాయకులు తులసిప్రసాద్, మైనారిటీ మహిళా నాయకులు అఖిల భాను, దిల్షాద్, ఎస్‌టియు నాయకులు మదన్, గుణశేఖర్, ఏపీటీఎఫ్ అమరనాథ్, విజయ కుమార్ కలిసి అభినందనలు తెలిపారు.

లోకేష్‌ను కలిసిన మీరానేతాజీ

ప్రజాశక్తి-నగరి: నెల్లూరులో కొనసాగుతున్న యువగళం పాదయాత్రలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను సోమవారం రాష్ట్ర తెలుగు మహిళా అధికార ప్రతినిధి ఆర్. మీరానేతాజీ మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే లోకేష్ బాబుతో కలిసి ఆమె యువగళం పాదయాత్రలో పాల్గొన్నారు.

తమిళనాడు మాజీ సీఎంను కలిసిన అంబ్రోస్ విల్సన్

ప్రజాశక్తి-నగరి: తమిళనాడు ఎఐఎడిఎంకె మాజీ సీఎం, పార్టీ జనరల్ సెక్రెటరీ ఎడప్పాడి పళణి స్వామిని సోమవారం చెన్నై మాజీ సీఎం నివాసంలోని ఎఐఎడిఎంకె కార్యాలయంలో ఆంధ్ర రాష్ట్ర కార్యదర్శి వి.అంబ్రోస్ విల్సన్ ఆధ్వర్యంలో నూతనంగా పదవులు పొందిన కార్యకర్తలు మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువాను కప్పి బొకేను అందజేశారు. అనంతరం ఆంధ్ర రాష్ట్ర ఏఐఎడిఎంకె కార్యకర్తలు చిత్తూరు జిల్లా తిరుపతి జిల్లా నెల్లూరు జిల్లా చెందిన నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన కార్యకర్తలను మాజీ సీఎం అభినందించారు.

టిడిపి సీనియర్ నాయకుడు మృతి

ప్రజాశక్తి-వి.కోట: వి.కోట మండల టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు, సీనియర్ టిడిపి నాయకుడు దయ్యాలపల్లికి చెందిన నారాయణ (54) అనారోగ్యంతో మృతి చెందారు. వారం రోజుల క్రితం గుండెపోటు రావడంతో అతన్ని చికిత్స నిమిత్తం పీఈఎస్ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించి అత్యవసర విభాగంలో చికిత్స అందించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం తుది శ్వాస విడిచారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి అమర్‌నాథ రెడ్డి దయ్యాలపల్లికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ క్రియాశీలక సభ్యుడిగా, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులుగా ఆయన పార్టీకి సేవలందించారని, వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన మృతి పట్ల మండల తెలుగుదేశం పార్టీ నేతలు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

పాముకాటుతో మహిళ...

కుముద
(పాత చిత్రం)

ప్రజాశక్తి-పాలసముద్రం: అర్ధరాత్రి పాము కాటుకు గురై మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని వెంగళరాజుకుప్పం పంచాయతీ కనికాపురం దళితవాడ గ్రామానికి చెందిన రామదాసు భార్య కుముద(29) సోమవారం ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పాము కాటుకు గురైంది. వెంటనే భర్తకు ఏదో విషపురుగు కొరికి నట్టు సమాచారం తెలపగా వెంటనే భర్త ఆసుపత్రికి తీసుకెళ్లాడు. మార్గమధ్యలోనే మహిళ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలికి ఇద్దరు సంతానం. కుమారుడు(9), కుమార్తె (8) ఉన్నారు. తల్లి మృతి చెందడంతో చిన్నారులు కన్నీరు మున్నీరయ్యారు. గ్రామస్తులు చిన్నారుల ఏడుస్తుండటం చూసి శోకసంద్రంలో మునిగారు.

సచివాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని పల్లి పంచాయతీలో రూ.40 లక్షలతో కొత్తగా నిర్మించిన సచివాలయ భవనాన్ని, చెన్నై-బెంగళూరు రహదారి నుంచి జీడిమకన్నపల్లి వరకు మంజూరైన రూ. 23 లక్షల సిసి రోడ్లను సోమవారం స్థానిక శాసనసభ్యులు వెంకటే గౌడ ప్రారంభించారు. సిసి రోడ్డును గ్రామానికి ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమాలను అరికట్టాలి

ప్రజాశక్తి-నగరి: కుశస్థలి నదిలో అక్రమంగా తోడుతున్న ఇసుక అక్రమాలను అరికట్టాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య సోమవారం డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులకు కేటాయించిన శ్మశానాలనూ వదలని ఇసుక మాఫియాను అరికట్టాలని సీపీఐ డిమాండ్ చేసినా రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం స్పందించలేదన్నారు. నగరిలోని ఇసుక తీసేస్తుండటంతో కుశస్థలి నది ఎడారిగా మారి భవిష్యత్తులో నగరి ప్రజలకు నీటి కొరత ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ ఇసుక మాఫియాను అరికట్టకపోతే భవిష్యత్తులో సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి వేలన్, ఎఐటియుసి పట్టణ కార్యదర్శి భాషా, సిపిఐ నాయకులు శేఖర్, గోవిందస్వామి, ఎఐటియుసి నాయకులు యేసు పాదం, కష్ణయ్య, రాజేంద్ర, మురళి, రవి తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE 1st ADDL. JUNIOR CIVIL JUDGE,CHITTOOR
O.S.No.114 /2022

Between
S.Gunasekhar ...**Plaintiff**
And
G.Sathya and others ....**Defendants**

SUMMONS TO DEFENDANTS NO.6

To
SMT SONIYA,
W/o Vikram, D/o Late T.Gunalan,
residing at Athmakur Village,
N.R.Pet Post,
G.D.Nellore Mandal,
Chittoor District.
Madam,

Please take summons that the above suit **O.S.No.114/2022** and also petition **I.A.No.137/2022** filed by plaintiff against you and others and the same is stands posted to **27.07.2023** for your appearance. If you do not appear on **27.07.2023** at 10.30 A.M before this Hon'ble Court either in person or through an Advocate the matter will be exparte.

Sd/-**M.CHANDRASEKHAR**
Advocate for Plaintiff,
Chittoor, Dt.30.06.2023

IN THE HONOURABLE COURT OF THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL CUM IV ADDITITIONAL DISTRICT JUDGE (SC&ST COURT) AT SRIKAKULAM.
I.A NO 127/2023 IN M.V.O.P NO.244 /2017

Between: **Guntu Akhila** -Petitioner.
And: **Hydar Sabi and two others** -Respondents

NOTICE

2nd Respondent: Dawood Saheb s/o not known, owner of the Crime Vehicle Lorry Bearing No. AP-03-X-1807 r/o Pathikonda Post, Mamadugu village, Gangavaram Mandal,Chittoor District.

Please take notice that the above number Petition filed by the Petitioner against the 2nd Respondent and other Respondents for claiming compensation of Rs. 6,00,000/- (six lakhs rupees only) for the grievous injuries sustained to minor child Guntu Akhila in a motor accident and this matter stands posted to **10-07-2023 at 10-30 A.M** For your appearance before the above said court, the 2nd respondent is hereby directed to appear before the above said court personally or through your advocate without fail, otherwise the matter will be decided in your absence.

(By order of the court)

M. PHALGUNA RAJU
Advocate for Petitioner.
Srikakulam

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR AT CHITTOOR
ARC.No. 313 OF 2022

Between:
Kapil ChitS(Hyd) Pvt., Ltd., Madanapalli Rep., by its Legal Officer **..Disputant**
And:
P. Palani Kumar & others **..Opponents**

SUMMONS TO OPPONENT NO.2

To
2. T. Ramaswamy, S/o T. Ponnuswamy,
Working as Police Constable,
AR 3rd. Platoon, Chittoor Town and District, residing at D.No.2-325,
Kongareddy palli Main Road, Near Karumariyamma Temple,
Chittoor District.
Sir,

Please take notice that the above case is posted to 15-07-2023 for your appearance. You may appear either in person or through an advocate on 15-07-2023 at 10.30 A.M. Without fail and file your objections, failing which the matter will be decided in your absence an ex party.

Hearing Date: 15-07-2023

Sd/-
SRI. M. RAJESH, M.COM., LLB.,
ADVOCATE ; TIRUPATI

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR AT CHITTOOR
ARC.No. 50 OF 2021

Between:
Kapil ChitS(Hyd) Pvt., Ltd.,
Tirupati-2 Rep., by its Legal Officer **..Disputant**
And:
C.Eswar Prasad & others **..Opponents**

SUMMONS TO OPPONENT NO.5

To
5. C. Bhagya Lakshmi,
W/o C. Eswar Prasad, residing at
D.No. 4-10/A, Kacharavedu, Alapakam,
Chittoor District.
Madam,

Please take notice that the above case is posted to 15-07-2023 for your appearance. You may appear either in person or through an advocate on 15-07-2023 at 10.30 A.M. Without fail and file your objections, failing which the matter will be decided in your absence an ex party.

Hearing Date: 15-07-2023

Sd/-
SRI. M. RAJESH, M.COM., LLB.,
ADVOCATE ; TIRUPATI

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR AT CHITTOOR
ARC.No. 314 OF 2022

Between:
Kapil ChitS(Hyd) Pvt., Ltd., Madanapalli
Rep., by its Legal Officer **..Disputant**
And:
B.Swarna Kumari & others **..Opponents**

SUMMONS TO OPPONENT NO.2

To
2. G. Rajasekhar, S/o G. Venkatramana,
Working as Police Constable,
Tirupati Urban Police Station, Tirupati.
Residing at D.No. 3-7, Ambedkar Colony,
Kondiahagaripalli, Nimmanapalli,
Chittoor District.
Sir,

Please take notice that the above case is posted to 15-07-2023 for your appearance. You may appear either in person or through an advocate on 15-07-2023 at 10.30 A.M. Without fail and file your objections, failing which the matter will be decided in your absence an ex party.

Hearing Date: 15-07-20 23

Sd/-
SRI. M. RAJESH, M.COM., LLB.,
ADVOCATE ; TIRUPATI